కర్ణాటక ప్రభుత్వంలో చీలిక?

- కులగణనపై సీఎం, డిప్యూటీ సీఎం మధ్య విభేదాలు
- నివేదికను అమలు చేస్తామన్న సీఎం సిద్ధరామయ్య
- శాస్త్రీయంగా మళ్లీ కులగణన చేపట్టాలన్న డీకే
- బోర్డులు, కార్పొరేషన్ల నియామకాలపైనా భిన్నస్వరాలు

బెంగళూరు, నవంబర్ 22: కులగణన విషయంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా చీలింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. తన గత టర్మ్‌లో నిర్వహించిన వివాదాస్పద కులగణన నివేదికను ఆమోదించి అమలు చేసేందుకు సీఎం సిద్ధరామయ్య సిద్ధమవుతుండగా.. దాన్ని వ్యతిరేకిస్తూ, అమలును నిలిపివేయాలని కోరుతూ ఇటీవల సీఎంకు సమర్పించిన ఓ మెమోరాండంపై వొక్కలిగ కమ్యూనిటీకి చెందిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తోపాటు మరో మంత్రి ఎంసీ సుధాకర్ సంతకాలు చేశారు. ఈ విషయాన్ని డీకే శివకుమారే తాజాగా స్వయంగా వెల్లడించారు. డీకే బుధవారం మీడియాతో మాట్లాడుతూ కులగణనపై తాను పార్టీ స్టాండ్‌లోనే ఉన్నానని చెబుతూనే, కులగణనను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని పలు కులాల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు కులగణనను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నానని సీఎం సిద్ధరామయ్య మంగళవారమే తన ఎక్స్ పోస్టులో చెప్పుకొచ్చిన తర్వాతనే.. డీకే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వొక్కలిక సంఘం సమర్పించిన మోమరాండంపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'నివేదిక ఇవ్వక ముందే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు. కొంత మంది అయితే కనీసం నివేదిక చూడకుండా వ్యతిరేస్తున్నారు. అసలు నివేదిక రానివ్వండి. దానిపై క్యాబినెట్‌లో చర్చిస్తాం' అని పేర్కొన్నారు. ఈ తాజా పరిణామాలు రాష్ట్ర కాంగ్రెస్‌లో కుమ్ములాటలను మరింత తీవ్రం చేసే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

వ్యతిరేకిస్తున్న లింగాయత్, వొక్కలిగలు

2015లో సిద్ధరామయ్య సీఎంగా ఉన్న సమయంలో కులగణన చేపట్టారు. దీన్ని రాష్ట్రంలో ఆధిపత్య కులాలుగా ఉన్న లింగాయత్‌లు, వొక్కలిగలు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. కులగణనపై ప్రభుత్వానికి ఈ నెల 24న 'సామాజిక, ఆర్థిక, అకడమిక్ సర్వే'పై నివేదిక సమర్పించే యోచనలో ఉన్నామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ కే జయప్రకాశ్ హెగ్డే ఇదివరకే వెల్లడించారు. నివేదికను తిరస్కరించాలని డిమాండ్ చేస్తూ వొక్కలిగ, లింగాయత్ కమ్యూనిటీలు ఆందోళనలు ప్రారంభించాయి. ఈ మేరకు వొక్కలిగ సంఘం ఈ నెల 15న సీఎం సిద్ధరామయ్యకు మెమోరాండం సమర్పించింది. దీనిపై డిప్యూటీ సీఎం డీకే, మరో మంత్రి సుధాకర్‌లతో సహా జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ, మాజీ సీఎంలు ఎస్ఎం కృష్ణ, సదానంద గౌడ, జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే, ప్రతిపక్ష నేత ఆర్ అశోక తదితర నేతలు సంతకాలు చేశారు.


సిద్ధరామయ్య డీకే శివకుమార్

సర్వే సరిగ్గా జరుగలేదు..

వొక్కలిగ సంఘం మెమోరాండంపై సంతకం పెట్టడాన్ని డీకే సమర్థించుకొన్నారు. 'సర్వే సరిగ్గా జరుగలేదని ఎమ్మెల్యేలు, కమ్యూనిటీ నేతలు భావిస్తున్నారు. కులగణనను శాస్త్రీయంగా చేపట్టాలి' అని పేర్కొన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, పంచమశాలీలు, వీరశైవులు వంటి అనేక కులాలు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతున్నాయని, ఆందోళనలు చేస్తున్నాయని, అదేవిధంగా వొక్కలిగలు కూడా చేస్తున్నారని శివకుమార్ అన్నారు. కులగణనకు ముందు తమను సంప్రదించలేదని కొన్ని కులాలు చెబుతున్నాయని, అందుకే వారు శాస్త్రీయ కులగణన డిమాండ్ చేస్తున్నారన్నారు.

తెగని పదవుల పంచాయితీ

మరోవైపు కర్ణాటకలో కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు మరింత ముదురుతున్నాయి. కరెంట్, నీటి సంక్షోభంతో పాటు ఇతర సమస్యలతో నానా ఇబ్బందులు పడుతున్న ప్రజలను, వారి సంక్షేమాన్ని వదిలేసి.. పదవులే ముఖ్యం అన్నట్టుగా నేతలు కొట్టుకొంటున్నారు. దీంతో రాష్ట్రంలోని పలు ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లలోని పదవుల నియామకాలు వాయిదాల మీద వాయిదాలు పడుతున్నాయి. పదవుల పంపిణీపై రాష్ట్ర నేతల మధ్య సయోధ్య కుదరక ఢిల్లీ అధిష్ఠానం ఇక్కడకు తన దూతలను పంపింది. అయినా ఈ పంచాయితీ తెగలేదు. ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్ల పదవుల నియామకాలపై తుది నిర్ణయం తీసుకోనేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలా మంగళవారం బెంగళూరులో నిర్వహించిన సమావేశం అసమగ్రంగా, అసంపూర్తిగా ముగిసింది. నియామకాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. దీంతో పదవుల పందేరం మరోసారి వాయిదా పడింది. ఈ వ్యవహారం ప్రభుత్వం, పార్టీలోని పెద్దల మధ్య విభేదాలు ముఖ్యంగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అంతర్గత కుమ్ములాటలను బహిర్గతం చేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు పోస్టుల పంపిణీ ప్రక్రియపై రాష్ట్ర హోంమంత్రి జీ పరమేశ్వర్ అసంతృప్తితో ఉన్నారని వార్తలు వస్తున్నాయి.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ 'మిస్డ్‌కాల్' కుట్ర!

- గ్యారెంటీలు కావాలంటే మిస్డ్ కాల్ ఇవ్వాలని ఓటర్లకు ఫోన్లు
- సీఎం గెహ్లాట్ వాయిస్‌తో కాల్స్
- తర్వాత ఫోన్లకు వరుస మెసేజ్‌లు
- వెంటనే ఆపాలని ఈసీ ఆదేశాలు
- అనుమతి లేకుండా ప్రచారమెలా?
- పీసీసీ అధ్యక్షుడికి నోటీసులు జారీ

అశోక్ గెహ్లాట్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్‌లో ఓటర్లను మాయ చేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న యత్నాలకు ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. 7 గ్యారంటీల లబ్ధి పొందాలంటే ప్రజలు మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ ఆ పార్టీ చేస్తున్న ఐవీఆర్ఎస్ ఆడియో ప్రచారాన్ని ఈసీ బుధవారం నిలిపివేసింది. హామీల్లో ఇచ్చిన ఏడు పథకాలను అమలు చేస్తామంటూ సీఎం అశోక్ గెహ్లాట్ గొంతుతో కాంగ్రెస్ వాయిస్ కాల్ ప్రచారం చేస్తున్నది. మరో కాల్ ద్వారా ఆయా పథకాల లబ్ధి పొందాలంటే నిర్దిష్ట మిస్డ్ కాల్ ఇచ్చి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని చెబుతున్నది. ఇలాంటి ఐవీఆర్ఎస్ ప్రచారానికి అనుమతి తీసుకోలేదని, నిబంధనలకు వ్యతిరేకమని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఆ ప్రకటనలను నిలిపేసింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీల నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది.

కాంగ్రెస్ చేస్తున్న మోసమిలా?

ఓటర్లను మోసగించేందుకు కాంగ్రెస్ ఈ విధమైన ప్రచారానికి దిగిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికలు పూర్తి కాలేదు, గెలవలేదు గానీ.. పథకాలకు ఎంపిక అయినట్టు, పేర్లు ముందే నమోదు చేసుకోవాలంటూ చేస్తున్న కాల్స్ వెనుక కుట్ర ఉన్నదని అంటున్నాయి. మిస్డ్ కాల్ ఇచ్చిన నంబర్లను నమోదు చేసుకొని, కాంగ్రెస్ ఆ తర్వాత తమ వైపు తిప్పుకొనేందుకు వారిని ఫోన్లకు వరుస మేసేజ్‌లు పంపుతున్నట్టు తెలుస్తున్నది. అసలు గెలువకుండా, ప్రభుత్వం ఏర్పాటుకాకుండా.. కాంగ్రెస్ ఆయా గ్యారెంటీ పథకాలను మిస్డ్ కాల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ప్రచారం చేయడం పచ్చి మోసమని ఎన్నికల పరిశీలకులు ఆరోపిస్తున్నారు.

అనుమతి తీసుకోని కాంగ్రెస్

ప్రకటనలకు సంబంధించి ఎన్నికల సంఘం స్పష్టమైన నిబంధనలను పేర్కొన్నది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఇచ్చే ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రసారమయ్యే ప్రకటనల ముసాయిదాలను ముందుగా ఈసీకి సమర్పించి, అనుమతి తీసుకోవాలి. అయితే కాంగ్రెస్ వాయిస్ కాల్ లాంటి ప్రచారానికి ఎలాంటి అనుమతి తీసుకోలేదు.

డబ్బు పంపిణీ వివాదంలో రాజస్థాన్ మంత్రి

సొమ్ము తిరిగిచ్చేసిన మహిళ వీడియో వైరల్

జైపూర్, నవంబర్ 22: రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రి ఒకరు ఓట్లకు నోట్ల పంపిణీ వివాదంలో చిక్కుకున్నారు. ఎన్నికల సందర్భంగా పంచిన డబ్బును ఒక మహిళ.. మంత్రి శాంతి ధర్‌వాల్‌కు తిరిగి ఇచ్చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలనుకుంటున్న మంత్రికి ఆ మహిళ భలే బుద్ధి చెప్పింది అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. సదరు మహిళ మాట్లాడుతూ.. భయ్యా వచ్చి 25 వేలు ఇచ్చారని మంత్రి ధర్‌వాల్‌తో పేర్కొంది. మంత్రితో మాట్లాడకుండా ఆమెను అడ్డుకునేందుకు మంత్రి అనుచరుడొకరు ప్రయత్నించారు. ఈ వీడియో వైరల్ కావడంతో, దీనిపై ప్రధాని మోదీ సైతం ఎన్నికల ప్రచార సభలో విమర్శలు గుప్పించారు. ఆ అవినీతి నేత చరిత్రను ఇప్పుడు దేశం మొత్తం చూస్తున్నదని వ్యాఖ్యానించారు. డబ్బుతో ఓటును కొనాలనుకుంటున్న మంత్రికి ఆ మహిళ బాగా బుద్ధి చెప్పిందని ఆమెను అభినందించారు.

టన్నెల్‌లోకి రెస్క్యూ సిబ్బంది

ఉత్తరకాశీ, నవంబర్ 22: ఉత్తరకాశీ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో బుధవారం రాత్రి కీలక ముందడుగు పడింది. కార్మికులను కాపాడటానికి చేపట్టిన 57 మీటర్ల డ్రిల్లింగ్ పనులు తుది దశకు వచ్చాయి. రాత్రి 11.30 గంటల సమయంలో టన్నెల్ లోపలికి ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ సిబ్బంది ఆక్సిజన్ సిలిండర్లు, ఇతర సరంజామాతో ప్రవేశించారు. రెస్క్యూ ఆపరేషన్ అత్యంత కీలక దశకు చేరుకుందని అక్కడి అధికారులు వెల్లడించారు. టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకొచ్చిన తర్వాత.. వారిని దవాఖానకు తరలించేందుకు అధికారులు పదుల సంఖ్యలో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. 'గురువారం తెల్లవారుజాము సూర్యోదయాన్ని కార్మికులు చూడబోతున్నారు. వారి కుటుంబాలకు గుడ్ న్యూస్' అంటూ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులు చెప్పారు.

సొరంగంలోకి వెళ్తున్న సహాయక సిబ్బంది

నీట్ సిలబస్ కుదింపు

న్యూఢిల్లీ, నవంబర్ 22: వైద్య విద్య ప్రవేశాలకు ఉద్దేశించిన జాతీయ స్థాయి పరీక్ష 'నీట్-యూజీ' సిలబస్‌ను తగ్గించారు. సీబీఎస్ఈ, ఇతర స్కూల్ బోర్డులు హేతుబద్ధీకరించిన పాఠ్యాంశాలకు అనుగుణంగా ఈ చర్య చేపట్టినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) బుధవారం వెల్లడించింది. నేషనల్ మెడికల్ కమిషన్ ఆధ్వర్యంలోని అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు నీట్(యూజీ)-2024 సిలబస్‌ను ఖరారు చేసిందని, దీన్ని నీట్ అభ్యర్థులు గమనించాలని నోటిఫికేషన్‌లో సూచించింది. ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో తుది సిలబస్ అప్‌లోడ్ అయిందని, సవరించిన సిలబస్‌ను చెక్ చేసుకోవాలని పేర్కొన్నది.

ఎఫ్ఎంజీఈ హాజరుకు 10 ఏండ్ల కాలపరిమితి

న్యూఢిల్లీ, నవంబర్ 22: విదేశాల్లో వైద్య విద్య పూర్తిచేసిన వారు రాసే ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఎంజీఈ) విషయంలో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) కీలక నిర్ణయం తీసుకొన్నది. కోర్సు పూర్తిచేసిన 10 ఏండ్ల వరకు మాత్రమే ఎఫ్ఎంజీఈ పరీక్షకు హాజరయ్యేందుకు అవకాశం ఉంటుందనిప్రకటించింది. మరోవైపు ఉక్రెయిన్ విదేశీ మెడికల్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు భారత్ కాకుండా ఇతర దేశాల్లో తమ చదువును కొనసాగించుకోవచ్చని ఎన్ఎంసీ పేర్కొన్నది.

ఖలిస్థాన్ ఉగ్రవాది పన్నూ
హత్యకు కుట్ర

వాషింగ్టన్: ఖలిస్థాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు జరిగిన కుట్రను అమెరికా అధికారులు భగ్నం చేశారు. దీని వెనుక భారత ప్రభుత్వం ప్రమేయం ఉన్నదన్న అనుమానాలపై భారత ప్రభుత్వంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు 'ఫైనాన్షియల్ టైమ్స్' వార్తా కథనం పేర్కొన్నది. పన్నూ హత్యకు కుట్ర జరిగిందని అమెరికాలోని అనధికారిక వర్గాలను ఉటంకిస్తూ బుధవారం ఈ వార్తా కథనం వెలువడింది. దీనిపై భారత విదేశాంగ శాఖ గానీ, ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం గానీ స్పందించలేదు.

రైతు సమస్యలపై దేశవ్యాప్త నిరసనలు

26 నుంచి 3 రోజులపాటు ఆందోళనలు: ఎస్‌కేఎం

చండీగఢ్, నవంబర్ 22: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న రైతుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26 నుంచి దేశవ్యాప్తంగా మూడు రోజుల పాటు ఆందోళన చేపడతామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రకటించింది. పెండింగ్ సమస్యలపై ఈ ఆందోళన నిర్వహిస్తున్నట్టు భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు జోగిందర్ సింగ్ తెలిపారు. ఆందోళనలో గవర్నర్ నివాసాన్ని ముట్టడించాలని, పోలీసులు అడ్డుకుంటే అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టాలని ఆయన రైతులను కోరారు.

తిరిగి ఓపెన్ ఏఐ సీఈవోగా ఆల్ట్‌మన్

శాన్‌ఫ్రాన్సిస్కో : 'చాట్ జీపీటీ' సృష్టికర్త.. శ్యామ్ ఆల్ట్‌మన్ తిరిగి 'ఓపెన్ ఏఐ'లో పూర్వపు బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఇన్వెస్టర్లు, ముఖ్య ఉద్యోగుల నుంచి ఒత్తిడి రావటంతో, కొత్త సభ్యులతో బోర్డును ఏర్పాటుచేయడానికి 'ఓపెన్ ఏఐ' సిద్ధమైంది. 'ఓపెన్ ఏఐ సీఈవోగా ఆల్ట్‌మన్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆల్ట్‌మన్‌ను తొలగిస్తూ ఓపెన్ ఏఐ బోర్డు వారం రోజుల క్రితం తీసుకున్న నిర్ణయం ఆ కంపెనీని తీవ్రంగా కుదిపేసింది. ఉద్యోగులు, ఇన్వెస్టర్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.

బుందేల్‌ఖండ్ డిమాండ్‌తో కొత్త పార్టీ

లక్నో, నవంబర్ 22: ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ సుల్‌ఖాన్‌సింగ్ మంగళవారం కొత్త పార్టీని ఏర్పాటుచేశారు. దానికి బుందేల్‌ఖండ్ లోక్‌తాంత్రిక్ పార్టీ (బీఎల్పీ)ని పేరు పెట్టారు. ప్రత్యేక బుందేల్‌ఖండ్ రాష్ట్రం ఏర్పాటు లక్ష్యంగా పార్టీని స్థాపించినట్టు ఆయన చెప్పారు. ఏడు జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. బుందేల్‌ఖండ్ రీజియన్‌లోని ఎనిమిది స్థానాలను గెలవడమే లక్ష్యంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్టు చెప్పారు.

చైనాలో మరో మహమ్మారి?

పాఠశాలల్లో వేగంగా వ్యాపిస్తున్న అంతుచిక్కని నిమోనియా

బాధిత చిన్నారులతో నిండిపోయిన బీజింగ్, లియోనింగ్ దవాఖానలు

బీజింగ్: కరోనా మహమ్మారి విలయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రపంచ దేశాలను కలవరపాటుకు గురి చేసే వార్త ఇది. కరోనా మహమ్మారికి పుట్టినిల్లయిన చైనాలో మరో మహమ్మారి పురుడుపోసుకుంటున్నదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. చైనాలోని బడుల్లో అంతుచిక్కని నిమోనియా వ్యాధి విజృంభిస్తున్నది. బీజింగ్, లియోనింగ్ నగరాల్లోని దవాఖానలు బాధిత చిన్నారులతో కిక్కిరిసిపోతున్నాయి. దీంతో తాజా పరిస్థితులు మునుపటి కరోనా సంక్షోభాన్ని గుర్తుకు తెస్తున్నాయి. కాగా, మిస్టరీ నిమోనియా వ్యాపిస్తుండటంతో స్కూళ్ల మూసివేత తప్పదని స్థానిక మీడియా వెల్లడించింది. బీజింగ్, లియోనింగ్ దవాఖానలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నది. బాధిత చిన్నారుల్లో అధిక జ్వరం, ఊపిరితిత్తుల మంట వంటి అసాధారణ లక్షణాలు ఉన్నట్టు తెలిపింది. అయితే ఇతర శ్వాసకోశ వ్యాధుల్లో కనిపించే దగ్గు, ఇతర లక్షణాలు లేవని వివరించింది.

బయటపెట్టిన ప్రోమెడ్

ప్రపంచదేశాల్లో మనుషులు, జంతువుల్లో వ్యాపించే వ్యాధులను ట్రాక్ చేసే సర్విలెన్స్ ప్లాట్‌ఫామ్ ప్రోమెడ్ చైనాలో తాజా నిమోనియా వ్యాప్తి గురించి మంగళవారం బయటపెట్టింది. 2019లో కరోనా వ్యాప్తి గురించి కూడా ఈ సంస్థనే మొదట హెచ్చరించింది. చైనాలో తాజా శ్వాసకోశ వ్యాధి ఎప్పుడు మొదలైందో స్పష్టంగా తెలియదని పేర్కొన్నది. అలాగే పెద్దలు ఈ వ్యాధికి గురయ్యారా లేదా అన్న విషయాన్ని కూడా వెల్లడించలేదు. మరో మహమ్మారిగా ఇది మారుతుందా అన్నది ఇప్పుడే చెప్పలేమని వివరించింది.

డబుల్ ఇంజిన్ ట్రబుల్

అమ్మకానికి మహారాష్ట్ర రైతుల అవయవాలు

ముంబై, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): బీజేపీ పాలిత మహారాష్ట్రలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంట నష్టాలతో అప్పుల పాలైన అన్నదాతలకు ఏం చేయాలో పాలుపోక.. ఆ అప్పులు తీర్చుకొనేందుకు ప్రభుత్వమే తమ అవయవాలు కొనుక్కోవాలంటూ దరఖాస్తు చేసుకొన్నారు. ఈ ఘటన హింగోళి జిల్లాలో చోటుచేసుకొన్నది. అధిక వర్షాల కారణంగా అనేక మంది రైతులు పంట నష్టపోయారు. వచ్చిన కొద్ది పంటకు కూడా మార్కెట్లో గిట్టుబాట రేటు లేకపోవడంతో రైతులు ఆర్థికంగా చితికి పోయారు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన రుణాలను ఎలా తీర్చుకోవాలో తెలియక 10 మంది రైతులు తమ కిడ్నీ, కాలేయం, కండ్లను మహారాష్ట్ర ప్రభుత్వానికి అమ్మకానికి పెట్టారు. ప్రభుత్వమే వాటిని కొని తమ అప్పు తీర్చాలని కోరుతూ్ల రైతులు స్థానిక తహసీల్దార్ ద్వారా ప్రభుత్వానికి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. తమ అవయవాలను అమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటామని దరఖాస్తు చేసుకున్నారు.

ఇద్దరు సైనికాధికారులు, ఇద్దరు జవాన్ల వీరమరణం

- మరో ఇద్దరు సైనికులకు తీవ్రగాయాలు
- జమ్ముకశ్మీర్ రాజౌరీలో ఎదురుకాల్పులు
- ఉగ్రవాదుల కోసం కొనసాగుతున్న వేట
- ఈ ఏడాది ముష్కరుల దాడుల్లో 26 మంది భద్రతా సిబ్బంది మృతి

రాజౌరి, నవంబర్ 22: జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో బుధవారం భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఆర్మీ అధికారులు, ఇద్దరు జవాన్లు అమరులయ్యారు. మరో ఇద్దరు గాయపడ్డారు. కాలాకోట్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం అందటంతో ఆదివారం నుంచి సైనిక బలగాలు గాలింపు చేపట్టాయి. దట్టమైన అడవిలో నక్కి ఉన్న ఉగ్రవాదులు బలగాలపై కాల్పులకు తెగబడ్డాయి. దీంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ క్రమంలో ఇద్దరు కెప్టెన్లు, ఒక హవల్దార్, ఒక జవాన్ వీరమరణం పొందినట్టు అధికారులు వెల్లడించారు. మరో మేజర్, జవాన్ గాయపడినట్టు తెలిపాయి. బాజిమాల్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నట్టు వివరించాయి.

సవాల్‌గా మారిన 'పిర్ పంజాల్'

ఈ ఘటన తర్వాత భారత సైన్యం మరింత అప్రమత్తమైంది. పెద్ద సంఖ్యలో బలగాల్ని ఘటనా స్థలానికి పంపింది. అటవీ ప్రాంతంలో నక్కివున్న ఉగ్రవాదుల కోసం వేట కొనసాగిస్తున్నది. గ్రామానికి అత్యంత సమీపంలో కార్డ్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఇండ్ల నుంచి ఎవ్వరూ బయటకు రావొద్దని పోలీసులు చెప్పారని గ్రామస్థులు తెలిపారు. పిర్ పంజాల్ అటవీ ప్రాంతం గత కొన్నాండ్లుగా సైన్యానికి సవాల్‌గా మారింది. ఉగ్రమూకలు ఇక్కడి దట్టమైన అడవుల్ని తమకు అనుకూలంగా మలుచుకున్నాయి. ఈ క్రమంలో నవంబర్ 17న భద్రతా బలగాలు ఒక ఉగ్రవాదిని మట్టుబెట్టాయి. ఏప్రిల్ 20, మే 5న పూంచ్, రాజౌరీ జిల్లాలోని మెంధార్, కాండీ అడవుల్లో జరిగిన కాల్పుల్లో 10 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. జమ్ముకశ్మీర్‌లో ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 120 మంది చనిపోగా, అందులో 81 మంది ఉగ్రవాదులు, 26 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. జమ్ము రీజియన్‌లో 46 మంది చనిపోయారు.

అమరుడైన సైనికాధికారి మృతదేహాన్ని తరలిస్తున్న జవాన్లు

ఇజ్రాయెల్, హమాస్ మధ్య డీల్

బందీల మార్పిడికి ఓకే

జెరూసలేం: ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు వర్గాల మధ్య తాత్కాలిక సంధి కుదిరింది. ఒప్పందంలో భాగంగా తమ వద్ద బందీలుగా ఉన్న 50 మందిని హమాస్ విడుదల చేయనుంది. ప్రతిగా ఇజ్రాయెల్ తమ దేశ జైళ్లలో నిర్బంధంలో ఉన్న 150 మంది పాలస్తీనియన్లను విడిచిపెట్టనుంది. అలాగే గాజాలోకి సహాయ సామగ్రికి అనుమతించనుంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి ఇరు వర్గాలు నాలుగు రోజులపాటు కాల్పుల విరమణ పాటించనున్నాయి.

అమెరికాలో అక్రమ వలసదారుల్లో మూడో స్థానంలో భారతీయులు

న్యూఢిల్లీ, నవంబర్ 22: అమెరికా అక్రమ వలసదారుల జనాభాలో మెక్సికో, ఎల్ సాల్విడార్ తర్వాత భారత్ మూడో స్థానంలో ఉందని 'ప్యూ రిసెర్చ్' తాజా నివేదిక పేర్కొన్నది. 2021నాటికి అమెరికాలో అక్రమ వలసదారుల జనాభా కోటీ 5 లక్షలకు చేరుకుందని, ఇందులో 7,25,000 మంది భారతీయులు న్నారని నివేదిక తెలిపింది.

పట్టాలు తప్పిన రైల్వే

- *100 సంపాదనకు 107 ఖర్చు*
- *ఆర్ఆర్‌కేఎస్ నిధులన్నీ మట్టిపాలు*
- *ఏటా 20 వేల కోట్లు రావాల్సి ఉన్నా.. 4500 కోట్లు కూడా రాని వైనం*
- *రైలు టైముకు స్టేషన్‌కు వస్తే పెద్ద వింతే*
- *9 ఏండ్లలో ట్రాక్‌ల అభివృద్ధి 0.7 శాతమే*



న్యూఢిల్లీ, నవంబర్ 22: ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన భారతీయ రైల్వే పట్టాలు తప్పింది. నిర్వహణ లోపం, నిధుల కొరత, పాతకాలం నాటి విధానాలు, ప్రయాణికులకు చుక్కలు చూపించే ప్రయాణాలు, పెంటకుప్పల్లాంటి స్టేషన్లు వెరసి పేదవాడి ప్రయాణ సాధనం పూర్తిగా గాడి తప్పింది. గత 9 ఏండ్లలో ఏ ఒక్క ఏడాది కూడా సంస్థ లక్ష్యాలను సాధించలేదంటే పరిస్థితిని అర్థంచేసుకోవచ్చు. ఈ పరిస్థితికి కారణం ఏమిటి?

ఆదాయం కంటే ఖర్చు అధికం

భారతీయ రైల్వేల నిర్వహణ గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. సంస్థ కార్యకలాపాలపై ఎవరికీ బాధ్యత ఉండదు. ఈ మాటలన్నది మరెవరో కాదు.. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్). ఈ సంస్థ 2021-22లో విడుదల చేసిన నివేదిక ప్రకారం మన రైల్వేస్ రూ.100 సంపాదించటానికి రూ.107.39 ఖర్చు చేస్తున్నదట. అంటే ఆదాయం కంటే ఖర్చు రూ.7.39 ఎక్కువ.

నిధుల దుర్వినియోగం

రైల్వేస్‌లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు మోదీ ప్రభుత్వం 2017లో రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ (ఆర్ఆర్ఎస్‌కే) పేరుతో నిధిని ఏర్పాటు చేసింది. ఈ నిధి నుంచి రైల్వేలో పాదాల మసాజర్స్, మట్టి పాత్రలు, ఎలక్ట్రికల్ ఉపకరణాలు, ఫర్నిచర్, చలి కోట్లు, కంప్యూటర్స్, ఎస్కలేటర్లు కొనుగోలు చేసేందుకు, టాయ్‌లెట్ల నిర్మాణానికి, జీతాలు, బోనస్‌లు చెల్లింపులకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఈ నిధికి ఏటా రైల్వేస్ రూ.15000 కోట్లు, కేంద్ర బడ్జెట్ నుంచి రూ.5000 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అంటే ఏటా ఈ నిధికి రూ.20,000 కోట్లు వస్తాయన్నమాట. ఒక్క ఏడాది కూడా పూర్తి నిధులు రాలేదు. ఈ నిధికి రూ.4,225 కోట్లు మాత్రమే సమకూరాయి. రూ.15,775 కోట్లు రాలేదు. అంటే.. మూడింట ఒక వంతు నిధులు కూడా ఈ నిధికి అటు రైల్వేస్‌గానీ, ఇటు ప్రభుత్వంగానీ సమకూర్చలేదు.

నిర్వహణ లోపాలు

కాగ్ ప్రకారం 2020-21 నాటికి డిప్రిసియేషన్ రిజర్వ్ ఫండ్ నుంచి సంస్థకు రూ.94,873 కోట్లు రావాలి. వాటిలో దాదాపు 60 శాతం.. అంటే రూ.58,459 కోట్లను రైల్వే ట్రాక్‌లను మార్చేందుకు వాడాల్సి ఉన్నది. కానీ, ఎంత వాడిందో తెలుసా? అక్షరాలా రూ.671.92 కోట్లు. అంటే లక్ష్యంలో కేవలం 0.7 శాతం అన్న మాట. ఇదీ రైల్వేల నిర్వహణ తీరు.

ప్రయాణికుల రద్దీ

ప్రపంచమంతా బుల్లెట్ రైళ్లు, హైపర్‌లూప్ రైళ్లు అని పరుగెడుతుంటే.. భారతీయ రైల్వేస్ మాత్రం ఇంకా ధూమశకటాల స్థాయిలో ఉన్నది. ఇప్పుడిప్పుడే ఏసీ కోచ్‌లను పెంచుతున్నది. ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసి బోగీలను పెంచటం తగ్గించటం చేయాలి. కానీ, మన రైల్వేస్‌లో అలాంటిది చాలా అరుదు. ఇంకా జనరల్, స్లీపర్ కోచ్‌లను పక్కన పెట్టేసి ఏసీ 3 టైర్ కోచ్‌లను రైళ్లకు తగిలిస్తుండటంతో.. సాధారణ ప్రయాణీకులకు రైలెక్కటం గగనంగా మారింది. మన రైళ్లలో ప్రయాణించే వారు అత్యధికులు జనరల్, స్లీపర్ బోగీల్లోనే వెళ్తారు. ఏసీ కోచ్‌ల్లో ప్రయాణం ఖరీదు కావటంతో వాటివైపు చూడరు. కానీ, జనరల్ టికెట్ తీసుకొని రైలెక్కిన ప్రయాణీకులకు ఆ భోగీల్లో కాలుపెట్టసందు లేకపోవటంతో రిజర్వ్ బోగీల్లోకి వెళ్లి కూర్చుంటున్నారు. అప్పటికే ఆ సీట్లు బుక్ చేసుకొన్నవారికి చేతిలో టికెట్ ఉన్నా కూర్చొనేందుకు సీటు దొరకటం లేదని కాగ్ తన నివేదికలో పేర్కొన్నది.

సమయ పాలన

మన రైళ్ల సమయ పాలన గురించి దేశంలో తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. 2012-13 లో 79 శాతం రైళ్లు ఆలస్యంగా నడువగా, 2018-19 నాటికి 69.23 శాతానికి తగ్గింది. అయినా, నూటికి 70 రైళ్లు ఆలస్యంగానే నడుస్తున్నాయని కాగ్ నివేదిక ఎత్తిచూపింది. మరోవైపు, ఏటా రైళ్ల సగటు వేగం తగ్గిపోతున్నదని కాగ్ కుండబద్ధలు కొట్టింది.